క్లుప్తంగా

జీతాలు చెల్లించాలంటూ నిరసన



మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో అంబులెన్స్ వద్ద నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలియజేస్తున్న పైలెట్ రవి, టెక్నీషియన్ సత్యారావు

డెంకాడ: పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ 108 అంబులెన్స్ ఉద్యోగులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబ సభ్యులతో పస్తులు ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే నెల 8వ తేదీ వరకు నిరసన తెలియజేస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పైలెట్ పి.రవి,టెక్నీషియన్ కె.సత్యారావు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలు తగవు..



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరావు

విజయనగరం ఫోర్ట్: నేటి యువత చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలు, అనైతిక శారీరక సంబంధాలు ఏర్పరచుని రోగాల బారిన పడుతున్నారని హెచ్ఐవీ నియంత్రణ సంస్థ క్లస్టర్ ప్రోగ్రాంమేనేజర్ కె. ఉమామహేశ్వరావు అన్నారు. బుధవారం స్థానిక ఎంఆర్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. జిల్లాలో రక్తనిల్వలు నిండుకున్నందున యువత రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి. నాగరాజు, సాక్షి గోపాలరావు, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు అభినందనలు



డీఈఓకి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న ఆపస్ సభ్యులు

విజయనగరం అర్బన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న యు.మాణిక్యంనాయుడును ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ (ఆపస్) సభ్యులు అభినందించారు. బుధవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి ఇజ్జిరోతు నాయుడు, జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వీవీజే సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఎ. కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు కె. భాస్కరరావు, కొయ్యాన నాయుడు, కార్యవర్గ సభ్యులు పి. సత్యారావు తదితరులు ఉన్నారు.

రెండో తేదీ నుంచి అన్నప్రసాదం పంపిణీ



ఉచిత అన్న ప్రసాద వితరణ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కంది మురళీనాయుడు, తదితరులు

విజయనగరం టౌన్: కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా అయ్యప్పస్వామి భక్తులకు నవంబర్ రెండో తేదీ నుంచి అన్నప్రసాదం పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రముఖ వ్యాపారవేత్త కంది మురళీనాయుడు తెలిపారు. బుధవారం స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 12 ఏళ్లుగా కార్తీకమాసంలో అన్నప్రసాద వితరణ చేస్తున్నామని, సుదూర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే భక్తులు మధ్యాహ్న భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాదం, సునీల్, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం..

విజయనగరం టౌన్: మాసశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని స్థానిక కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి నేతృత్వంలో సుమారు వెయ్యి మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం అందజేశారు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమణమ్మ, మారమ్మ, ప్రకాష్, శెట్టి, శోభారాణి, భీమ, రుజుతా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

• ఈవీఎం గోదాముల తనిఖీ..



నగర పంచాయతీ పరిధిలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములకు వేసిన సీళ్లను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తనిఖీల్లో డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాస మూర్తి, ఆర్‌డీఓ డి.కీర్తి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, నెల్లిమర్ల తహసీల్దార్ సుదర్శన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

– నెల్లిమర్ల

• విజయ గణపతికి ప్రత్యేక పూజలు..



మండలంలోని సారిక పంచాయతీ పరిధిలో గల రామనారాయణంలో విజయ గణపతికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హస్తా నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయం అర్చకులు చాణక్య, శ్రీహర్ష మహా గణపతికి అర్చన, పంచామృతాభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

– విజయనగరం రూరల్

• అభినందనలు..



మండల కేంద్రంలోని కొమ్మూరు అప్పడుదొర కళాశాలలో ప్రథమ ఇంటర్ చదువుతున్న బంగారు దుర్గాప్రసాద్ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ –19 వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 22న విజయనగరంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపిక పోటీల్లో దుర్గాప్రసాద్ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ మేరకు విద్యార్థిని పిరన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బంది బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

– భోగాపురం

- ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదం తప్పదు
- చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే ఆనందహేళి

దీపావళి.. వెలుగుల పండగ కావాలి..



విజయనగరం క్రైమ్: దీపావళి... ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపే పండగ. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ సందడిగా జరుపుకునే పండుగ ఇది. గురువారం ఉదయం నుంచే గ్రామాలు, పట్టణాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. సాయంత్రం పూజా కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత టపాసులు కాల్చేందుకు ప్రతి ఒక్కరూ ఉవ్విళ్లూరుతుంటారు. అయితే అప్రమత్తంగా వ్యవహరించి పండగ ఆనందంగా జరుపుకోవాలని పలువురు సూచిస్తున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా పెద్ద ప్రమాదాలు చోటుచేసుకుని, కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు ఏర్పాటు చేశారు. బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక, పోలీస్ అధికారులు పలు సూచనలు చేశారు.

ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు, ఇతర మండే పదార్థాలు అందుబాటులో ఉంచవద్దు.
- పెద్దల పర్యవేక్షణలో పిల్లలు టపాసులు కాల్చే విధంగా చూడాలి.
- దీపావళి రోజున ఇళ్లవద్ద బాణసంచా కాలుస్తున్నప్పుడు ఒక డ్రమ్ము నీరు అందుబాటులో ఉంచుకోవాలి. కాటన్ దుస్తులు బిగుతుగా ఉండేవి తప్పనిసరిగా ధరించాలి. పిల్లలు, పెద్దలు తప్పనిసరిగా చెప్పులు వేసుకోవాలి.
- ఒకసారి అంటించిన తర్వాత వాటి వద్దకు వెళ్లి కాలలేదని, నోటితో ఊదటం గాని, మరలా అంటించే ప్రయత్నం చేయకూడదు.
- ప్రమాదవశాత్తూ దుస్తులకు నిప్పు అంటుకుంటే పరిగెత్తకుండా, నేలపై దొర్లడం, నీటిని శరీరంపై వేసుకోవడం చేసి మంటలను అదుపుచేయాలి.
- కాలిన భాగాలపై చల్లని నీటిని వేయాలి.
- తక్కువ శబ్దం, తక్కువ కాలుష్యం ఉన్న టపాకాయలను మాత్రమే కాల్చి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి



దీపావళి పండగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి. పిల్లలు, పెద్దలు బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి. ఆనందంగా, సురక్షితంగా పండుగ నిర్వహించుకోవాలి. అడుగడుగునా పోలీస్ నిఘా పెట్టాం. ఆనందకరమైన వాతావరణంలో పండగ నిర్వహించుకోవాలి. ప్రజలకు, పోలీసు సిబ్బందికి దీపావళి శుభాకాంక్షలు.

– వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



టపాసులు అమ్మే వారంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అందుబాటులో అగ్నినిరోధక పరికరాలు కనీసం ఒకటైనా ఉంచాలి. ఇసుక, నీటిని తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లల్లో టపాసులు కాల్చేటప్పుడు మహిళలు, యువతులు, చిన్నారులు కాటన్ దుస్తులు బిగుతుగా ఉండేవి ధరించాలి. నీటిని అందుబాటులో ఉంచుకోవాలి. కేఎల్.పురం వద్ద ఫైర్ ఔట్‌పోస్ట్, వాటర్ ట్రాక్టర్ పెట్టి పంపు సౌకర్యం ఏర్పాటుచేశాం. జిల్లా వ్యాప్తంగా సుమారు వందలోపు షాపులకు అనుమతులున్నాయి.

– టీవీఎస్ రామ్‌ప్రకాష్, జిల్లా అగ్నిమాపకశాఖాధికారి, విజయనగరం

ప్రమాదాలకు తావియ్యకండి



కుటుంబ సమేతంగా ఆనందంగా దీపావళి పండగ నిర్వహించుకోవాలి. ఎటువంటి ప్రమాదాలకు తావివ్వరాదు. ప్రమాదం జరిగినప్పుడు పరుగులెత్తకూడదు. చల్లటినీటితో గాయంపై కడగాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు, నీటిని సిద్ధంగా ఉంచుకోవాలి. ఇళ్లల్లో మందుగుండు తయారుచేయకండి. అనధికారికంగా చేస్తే చర్యలు తప్పవు.

– వి.సోమేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, విజయనగరం

• పీహెచ్‌సీలో కుక్క కాట్లు ఉచితం..



ఇదేంటి ఆస్పత్రిలో కుక్క కాట్లు ఉచితం అనుకుంటున్నారా.. అవును ఇది నిజమే.. భోగాపురం మండలం సుందరపేట సామాజిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. ప్రధాన ఆస్పత్రి గదుల్లోనే ఇవి హల్‌చల్ చేస్తుంటే రోగులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో కుక్క కాటు బాధితులు ఎక్కువవుతున్నారు. అయినప్పటికీ పీహెచ్‌సీ సిబ్బంది నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

– భోగాపురం

• స్థల పత్రాల అందజేత..



పోస్టాఫీస్ భవన నిర్మాణానికి సంబంధించి మండల రెవెన్యూ కార్యాలయం సమీపంలోని సర్వే నంబర్ 343పిలో కేటాయించిన పది సెంట్ల స్థలానికి సంబంధించిన పత్రాలను తహసీల్దార్ సురేష్ జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరి శ్రీనివాస్‌కు బుధవారం అప్పగించారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు పత్రాలు అందజేసినట్లు తహసీల్దార్ చెప్పారు. ఆ స్థలంలో పోస్టాఫీస్ భవనంతో పాటు స్పీడ్‌పోస్టు పార్సిల్ హబ్‌ను కూడా నిర్మించనున్నట్లు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ (ఐపీఓ) సత్యనారాయణ, ఆఫీస్ అసిస్టెంట్ సుజాత, సబ్ పోస్టుమాస్టర్ పప్పల శ్రీనివాస్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

– భోగాపురం

డునాంట్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

- రెడ్‌క్రాస్ కార్యదర్శి సత్యం



డునాంట్ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

విజయనగరం ఫోర్ట్: జీన్ హెన్రీ డునాంట్‌ను ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పి. సత్యం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డునాంట్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ ద్వారా నిరంతర సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రెజరర్ టి. రామారావు, అప్పలనాయుడు, గౌరీశంకర్ పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై నిఘా..



డీఈఓను సత్కరిస్తున్న బాబ్జీ, తదితరులు

విజయనగరం పూల్‌బాగ్: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే కొంతమంది ఉపాధ్యాయులపై జిల్లా అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి డీఈఓ మాణిక్యంనాయుడును కోరారు. బుధవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓను కలిశారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ.. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తిస్తే జరిగే పరిణామాల తీవ్రతను వారికి తెలియజెప్పాలన్నారు. అటువంటి వారిని గుర్తించి కౌన్సెలింగ్ చేపట్టాలని కోరారు. కొన్నిచోట్ల కొంతమంది ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్లు రాజకీయ పార్టీల అండలతో మోనార్కుల్లా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదుల వస్తున్నాయని డీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, పాఠశాలల చుట్టూ రక్షణ గోడలు నిర్మించడానికిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఈఓను సత్కరించారు.

నెల్లిమర్ల కూటమిలో ఆధిపత్య పోరు

- నెల్లిమర్ల కౌన్సిల్ సమావేశంలో నేతల వాగ్వాదం
- అర్ధంతరంగా వెళ్లిపోయిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి
- సమావేశాన్ని నడిపించిన టీడీపీ నాయకుడు బంగార్రాజు



సమావేశంలో విమర్శలు చేసుకుంటున్న ఎమ్మెల్యే మాధవి, టీడీపీ నాయకుడు బంగార్రాజు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నియోజకవర్గంలో టీడీపీ కూటమి నేతల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. నువ్వెంత అంటే నువ్వెంత అన్నట్టుగా నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బుధవారం జరిగిన నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం సాక్షిగా జనసేన ఎమ్మెల్యే లోకం నాగమాధవి, టీడీపీ నాయకుడు, ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మధ్య విభేదాలు బయటపడ్డాయి. కౌన్సిల్ సభ్యుల ముందు ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సమావేశాన్ని నడిపించే అధికారం ఎమ్మెల్యేకు లేదని బంగార్రాజు ఆరోపించగా, సమావేశం నుంచి బంగార్రాజు వెళ్లిపోవాలని ఎమ్మెల్యే అనడంతో ఇరువురి మధ్య వాదన పెరిగింది. బంగార్రాజు వెళ్లకపోవడంతో మనోవేదనకు గురైన ఎమ్మెల్యే సమావేశం రద్దు చేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. ఆమె వెళ్లిపోయిన తర్వాత బంగార్రాజు సూచనతో చైర్‌పర్సన్ బంగారు సరోజిని సమావేశం కొనసాగించారు. దీనిపై జనసేన నాయకులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎమ్మెల్యే అని చూడకుండా టీడీపీ నాయకుడు రెచ్చిపోవడంపై ఆ పార్టీ నాయకులు మండిపడుతున్నారు. మరోవైపు తమ ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే మాధవి తమపైనే పెత్తనం చెలాయిస్తోందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. కొందరు బహిరంగంగానే దుమ్మెత్తిపోస్తున్నారు. అనవసరంగా గెలిపించి మోసపోయామని చెబుతున్నారు. జనసేన మద్దతు ఇవ్వకుంటే అసలు రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చేది కాదని ఆ పార్టీ వర్గాలు ప్రతివిమర్శలు చేశాయి. మొత్తానికి నెల్లిమర్ల కూటమిలో ఆదిపత్యపోరు ఎక్కడివరకు వెళ్తుందోనన్న చర్చ సాగుతోంది.

ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

- డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేవీ ప్రభాకర్

విజయనగరం పూల్‌బాగ్: ప్రైవేట్ రంగాల్లో కూడా దళితులకు రిజర్వేషన్లు అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అమర్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖల్లో అనేక ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదన్నారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయడంతో ఆయా సెక్టార్లలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆర్. సంతోష్, అంబేడ్కర్ అశోక్, ఒమ్మి రమణ, ఎ. ఆనందరావు, ఎ. కృష్ణ, పి. రామకృష్ణ, ఆర్. రమణ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల నియోజకవర్గ ఓటర్లు 2,13,695

నెల్లిమర్ల: నెల్లిమర్ల నియోజకవర్గంలో 2,13,695 మంది ఓటర్లున్నారని తహసీల్దార్ పి. సుదర్శనరావు, ఎన్నికల డీటీ వీవీఆర్ జగన్నాథరావు తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ, ఓటర్లకు సంబంధించి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,05,674, మహిళా ఓటర్లు 1,08,018 కాగా ట్రాన్స్‌జెండర్లు ముగ్గురున్నారని పేర్కొన్నారు. ఓటర్ల నమోదుకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు, వినతులున్నా నవంబరు 28లోగా ఆయా ప్రాంతాల బీఎల్‌ఓలకు అందజేయాలన్నారు.

రామతీర్థంలో అభివృద్ధి పనులు పునఃప్రారంభం



ఉత్తరరాజగోపురం వద్ద జరుగుతున్న ప్రహరీ పనులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానంలో అభివృద్ధి పనులు ఎట్టకేలకు పునః ప్రారంభమయ్యాయి. దేవస్థానంలో వివిధ అభివృద్ధి పనులకు గాను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఏడాది కిందటే శాశ్వత యాగశాల నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆలయంలో ఫ్లోరింగ్ పనులు కూడా దాదాపు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉత్తర రాజగోపురం ఎదుట చేపట్టిన సుందరీకరణ పనులను స్థానిక టీడీపీ నేతలు అడ్డుకున్నారు. షాపులు ఏర్పాటు చేసుకునేందుకు ప్రధాన రహదారి నుంచి ప్రహరీని కుదించి కట్టాలని పనులను అడ్డగించారు. దీంతో మూడు నెలల నుంచి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ పంచాయితీ చివరికి స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవితో పాటు ఆలయ ట్రస్టీ అశోక్ గజపతిరాజు వద్దకు కూడా చేరింది. దీంతో ఎమ్మెల్యే, ట్రస్టీ ఆదేశాల మేరకు మళ్లీ పనులు ప్రారంభించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర దిగుబడులు

- ఎమ్మెల్యే నాగమాధవి



పేరాపురంలో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి, ప్రధాన శాస్త్రవేత్త తేజేశ్వరరావు, తదితరులు

పూసపాటిరేగ : ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యకర దిగుబడులు వస్తాయని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని పేరాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించాలని సూచించారు. రైతు ఆర్థికంగా ప్రగతి సాధించినప్పుడే అందరం అభివృద్ధి చెందుతామని చెప్పారు. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త తేజేశ్వరరావు మాట్లాడుతూ.. సాగులో మెలకువలను రైతులకు వివరించారు. వరిసాగులో విత్తన శుద్ధి నుంచి నీటి యాజమాన్యం, సస్యరక్షణ చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తాడ్డి గోవింద, ఎంపీడీఓ ఎం.రాధిక, మండల వ్యవసాయాధికారి కె. నీలిమ, ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్న, ప్రజాప్రతినిధులు పతివాడ శ్రీనివాసరావు, కోట్ల రఘు, శంకాబత్తుల సత్తిబాబు, మహంతి శివ, కొలచిన రమేష్, జమరాజు, తదితరులు పాల్గొన్నారు.